యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్

విశాలాంధ్ర-సబ్బవరం: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శంకర్ కోరారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లీగల్ సెల్ వారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి , ప్రొఫెసర్ రఫాత ఖాన్ మాదకద్రవ్యాల వినియోగం ఏ విధంగా ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది, మాదకద్రవ్యాల పై వివిధ రకాల చట్టాలను, వివిధ రకాల శిక్షలను ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చైతన్యం కలిగించే విధమైన ఒక హాస్య నాటికను లాయర్ విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ బి శంకర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైనటువంటి యువత భారతదేశ నిర్మాణానికి వెన్నుముక లాంటిది, ఎట్టి పరిస్థితుల్లోనూ, మత్తు పదార్థాలు జోలికి వెళ్ళకూడదు అని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గణేష్ లెక్కల, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సిద్ధంగా ఉంది - రైతులెవరూ ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-కె.కోటపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో గంగవరం పోర్టుకు 10,350 టన్నుల యూరియా వచ్చిందని రైతులు ఆందోళన చందనక్కర్లేదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎరువుల డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని, దీన్ని ప్రధానంగా వైకాపా దుష్ప్రచారానికి తెరలేపిందన్నారు . తెలుగుదేశం ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, సెప్టెంబర్ లో రావలసిన యూరియా ముందుగానే రాష్ట్రానికి రప్పించిన ఘనత ముఖ్యమంత్రి కే చెందుతుందన్నారు. సోమవారం నుండి రైతులకు అవసరం మేరకు యూరియా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రైతులు వరి పంట ఎన్ని హెక్టార్లలో పండిస్తున్నారో అధికారులు వద్ద లెక్కలు ఉన్నాయన్నారు. వరి పండించిన ప్రతి రైతుకు యూరియా సప్లై చేయడం జరుగుతుందన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పోలీస్ విజిలెన్స్ అగ్రి విజిలెన్స్ తో నిరంతరంగా తనిఖీలు చేస్తున్నామన్నారు . ఎరువులు డీలర్లు అత్యాశకు పోయి అధిక ధరలకు అమ్మితే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వారి లైసెన్సులు రద్దు అవుతాయని హెచ్చరించారు. అలాగే సెప్టెంబర్ 1న అర్హత ఉన్న దివ్యాంగులకు పెన్షన్లను రద్దు చేయడం జరగదు అన్నారు. ఎవరైతే దొంగ సర్టిఫికెట్లతో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారో వాటిని మాత్రమే తొలగించడం జరుగుతుందన్నారు. దీనిపై దివ్యాంగులు ఎవరూ ఆందోళన చెందనక్కర్లేదన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వీఎమ్ఆర్డీఏ నిధులతో కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేయడానికి ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ను ఎమ్మెల్యే బండారు అనుమతి కోరగా పార్టీలు వేరైనా అభివృద్ధి విషయంలో తాను ముందు ఉంటానని ఎంపీపీ, ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని పరిశీలించారు . ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి పూర్ణిమాదేవి రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ తహసిల్దార్ భుజంగరావు ఎంపీడీవో సాంబశివరావు దేశం నాయకులు జూరెడ్డి రాము , దాడి ఎరుకనాయుడు , పూడి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కన్విక్షన్ శాతం పెంపులో కోర్టు కానిస్టేబుళ్లది కీలక పాత్ర

ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: అనకాపల్లి, విశాఖపట్నంలలో వివిధ కోర్టులలో ఉన్న కేసులను వేగవంతంగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేసి, సాక్షులకు సమయానుసారం సూచనలు ఇవ్వాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. కోర్టు కానిస్టేబుల్స్, సి ఎం ఎస్ సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసులు, సమన్లు, నాన్-బెయిలబుల్ వారెంట్లు, పిటి కేసులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు శిక్షలు విధింపబడేలా కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బందితో సమన్వయం పెంచి, సాక్షులు ఎటువంటి ఒత్తిడులకు లేదా ప్రలోభాలకు లోనుకాకుండా సమయానికి కోర్టులో హాజరు కావడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెప్టెంబర్ 13న జరగబోయే లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కన్విక్షన్ శాతం పెంపులో కోర్టు కానిస్టేబుల్స్ కీలక పాత్ర పోషిస్తున్నారు. స్టేషన్ స్థాయిలో కోర్టు సంబంధిత సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. కోర్టు కేలండర్ ద్వారా కేసుల పురోగతిని నిరంతరం అధికారులకు తెలియజేయాలని తెలిపారు. . సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు చేయాలన్నారు. దర్యాప్తులో ఎక్కడా అలసత్వం చోటు చేసుకోరాదు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 39 మంది నిందితులకు శిక్షలు విధింపబడడం, కోర్టు కానిస్టేబుల్స్ , సి ఎం ఎస్ సిబ్బంది కృషికి నిదర్శనం అని అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మోహనరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ లక్ష్మణమూర్తి, సి ఎం ఎస్ ఎస్ఐ రమణయ్య, కోర్టు కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనలో భాగంగా బైలపూడిలో భారీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర -చీడికాడ: అనకాపల్లి సబ్ డివిజన్ జిల్లా యస్ పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గంజాయి రవాణా అక్రమ కార్యకలాపాలను అరికట్టే క్రమంలో జిల్లా సబ్ డివిజన్ డిఎస్పీ ఎమ్ శ్రావణి ఆధ్వర్యంలో శనివారం కె కోటపాడు సీఐ పైడపునాయుడు చీడికాడ ఎస్సై బి సతీష్ 15 మంది ఎస్సైలు 100 మంది సిబ్బందితో కలిసి శనివారం 4గంటల నుండి 8గంటల వరకు మండలంలోని బైలపూడి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా ఆపరేషన్ లో రికార్డులు లేని 13 మోటార్ సైకిళ్లు 1 ఆటో 2 కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు గ్రామంలో గంజాయి కేసుల్లో ఇప్పటివరకు 38 మంది సస్పెక్ట్ షీట్ హోల్డర్లు మొత్తం 92 మంది నిందితులు ఉన్నారని తెలిపారు వారిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతివారం కౌన్సిలింగ్ నిర్వహిస్తుని తెలిపారు ఇప్పటివరకు గ్రామానికి చెందిన 11 మంది వ్యక్తులకు గత ఏడాది కాలంలో గంజాయి కేసుల్లో 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా విధించబడిందన్నారు అదనంగా ఇద్దరు పై ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ చేపట్టబడిందని అన్నారు ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీమతి శ్రావణి సస్పెక్ట్ షీట్ హోల్డర్లతో పాటు గ్రామస్తులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు గంజాయి రవాణా చేసిన విక్రయానికి పాల్పడిన వారిపై యన్ డి పి యస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు.

సెప్టెంబర్ 2న జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-నాతవరం: సెప్టెంబర్ 2న జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నాతవరం పోలీస్ స్టేషన్ పక్కన జనసేన పార్టీ కార్యాలయంను ప్రారంభించనున్నట్లు జనసేన పార్టీ నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బిసి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర హాజరవుతా రన్నారు. అదే రోజు పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి భారీ ఎత్తున మహిళలకు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. కావున జనసేన నాయకులు, పార్టీ క్రియాశీలక సభ్యులు, వీర మహిళలు, కార్యకర్తలు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆకతాయి యువతకు పోలీస్ కౌన్సిలింగ్

విశాలాంధ్ర -చోడవరం: ఆగస్టు 30, చెడు ప్రవర్తన విడనాడి సత్ప్రవర్తన, వినయం కలిగి ఉండాలని ఆకతాయి యువతకు పోలీస్ సిఐ అప్పలరాజు శనివారం స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వినాయక చవితి, పండుగలు, నిమజ్జన ఉత్సవాలు సందర్భంగా మండలంలో చెడు నడత గల వారిని అందరిని పోలీస్ స్టేషన్ కు రప్పించి వారితో మాట్లాడారు. ముందస్తుగా అనుమానితులు, దుశ్చర్యలకు పాల్పడే వారినందరినీ పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని సీఐ తెలియజేశారు.

ఎరువుల షాపును తనిఖీ

విశాలాంధ్ర -యస్.రాయవరం: మండలంలోని గుడివాడ జంక్షన్ లో ఉన్న ఎరువుల షాపును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి మోహన్ రావు తనిఖీ చేశారు. శనివారం షాపును తనిఖీ చేసి యూరియా అమ్మకాలు నిల్వ తదితర రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సౌజన్య ,ఉమా ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీయడానికే ఎస్సీ వర్గీకరణ

ఈ కుట్రకు మోడీ, బిజెపి సూత్రధారులు

నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు డాక్టర్ రత్నాకర్

విశాలాంధ్ర-అనకాపల్లి: దళితుల ఐక్యతను, రాజ్యాంగపరంగా వారి ఎదుగుతున్న తీరును సహించలేక కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దళితుల ఐక్యతను దెబ్బతీయడానికి ఎస్సీ వర్గీకరణను చేపట్టినట్లు నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు డాక్టర్ రత్నాకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశ వ్యాప్త మోడీ, బిజెపి కుట్రలో చంద్రబాబు నాయుడు భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు .చంద్రబాబు మాల సామాజిక వర్గంపై పగబట్టేసి తొక్కేసే కార్యక్రమాన్ని భుజాన్ని వేసుకుని నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గం పై తెలుగు రాష్ట్రాల్లో కత్తి కట్టాయని అన్నారు. దళితులను ముఖ్యంగా మాలలను హోల్‌సేల్గా వాడుకున్నటువంటి హోల్‌సేల్ మేనమామ, జగన్మోహన్ రెడ్డి దీనిపై కనీసం నోరు మెదపకపోవడం ఈనాటికి తన స్టాండ్ ఏంటో చెప్పకపోవడం, అత్యంత బాధాకరం, కులాన్ని మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలోపడ్డాడు మోడీ అతని గుజరాతి పరివారం మొత్తం, ఎలక్షన్ కమిషన్ పావుగా వాడుకుని దొంగతనంగా గెలిచి, తన పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు.

రిజర్వేషన్ పేరుతో ఎంగిలి మెతుకులు పడేసి, అందులో వాటాల కోసం కొట్టుకు చావండి అనే ఉద్దేశంతోనే ఈ ఎస్సీ వర్గీకరణ తెరపైకి తెచ్చారని అన్నారు.

దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థల్ని మోడీ నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దమ్ముంటే ఎలక్షన్లు రద్దుచేసి స్వాతంత్రంగా బ్యాలెట్ పేపర్ తో గెలిచి తన సామర్థ్యాన్ని నిరూపించు కోవాలి బిజెపి, కులాల మతాల పేరుతో ప్రజలను విభజించి పాలించే పద్ధతి ఎంతో కాలం కొనసాగదన్న విషయాన్ని బిజెపి గమనించాలని హితవు పలికారు. అపూర్వ సహోదరులు గురు శిష్యులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి ఇద్దరు కూడా మాల సామాజిక వర్గం పై సాధిస్తున్న కక్ష సాధింపు విషయంలో ఇకనైనా పునర్ ఆలోచన చెయ్యాలని, ఎస్సీ వర్గీకరణ తప్పు వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణ టెంపరరీ మాత్రమే, శాంతియుత నిరంతర పోరాటం, పార్లమెంట్లో అమెండ్మెంట్ చేసేవరకు, ఇప్పుడు ఇచ్చిన ఏడుగురు జడ్జిల తీర్పును 11 జడ్జిల, అంతకన్నా ఎక్కువ జడ్జిలతో ఈ తీర్పును పునః సమీక్షించేంతవరకు ఈ నిరంతర శాంతియుత పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. సమావేశంలో కొత్తపల్లి శ్రీనివాస్, అంగుళూరు ఈశ్వర , రేబాక మధుబాబు, బొలిమి వినోద్ కుమార్ ,షేక్ జిలాని, టి సుబ్బారావు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా,డి ఎ.పి. ధరలపై సూచనలిచ్చిన ఏవో

విశాలాంధ్ర-రాంబిల్లి: యూరియా ధర బస్తాకి(45కేజీలు) రూ.266.50, డిఎపి రూ.1342 ఖచ్చితంగా పాటించాలని అందరు ప్రైవేట్ డీలర్లు,వ్యవసాయ సిబ్బందికి మండల వ్యవసాయ అధికారిని. సుమంత సూచించారు. శనివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాంబిల్లి మండలంలో, 5653 ఎకరాల వరి సాధారణ విస్తీర్ణంలో ఇప్పటికి 2079 ఎకరాల వరి విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 144 టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 30 టన్నులు సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం కట్టుబోలు, గోకివాడ, దిమిలి,మామిడివాడ గ్రామాల్లో గల రైతుసేవకేంద్రాలలో 37 టన్నుల యూరియా, రాంబిల్లి, మురకాడ, మామిడివాడ ఆర్ఎస్‌కెలలో 36 టన్నుల డిఎపి అందుబాటులో ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని పెంటకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చెందిన సిహెచ్ వేణుగోపాల్ ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పి.ఆర్.టి.యు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడపా సూర్యనారాయణ, హరికృష్ణ, ఉమామహేశ్వరరావు, వీరభద్రరావు, సత్యనారాయణ, విజయలక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మై హోమ్ 18వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర -యలమంచిలి: మండలంలోని ములకలాపల్లి గ్రామంలో గల మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరి) స్థాపించి నేటికి 18 సంవత్సరములు పూర్తి చేసుకొన్న సందర్భముగా ఎన్.టి.ఆర్ ట్రస్ట్ విశాఖపట్నం వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగినదని ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ బి. రామస్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 80 మంది ఫ్యాక్టరీ ఉద్యోగులు, కాలనీ మహిళలు మరియు కార్మికులు రక్తదానం చేయడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ బి. రామస్వామి, సీనియర్ డి.జి.ఎం (పి.అండ్.ఎ) ఎల్. శ్రీనివాసరావు, ఓ.హెచ్.సి ఇన్చార్జ్ బి. రాజు, ఎన్.టి.ఆర్ ట్రస్ట్ డాక్టర్ సత్యనారాయణ, ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో లక్ష్యాలు సాధ్యం

విశాలాంధ్ర -కోటవురట్ల: శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ సమిష్టి కృషితో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని డిఆర్డిఏ పిడి శచీదేవి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు గ్రామ సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ ప్రభు త్వ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. వ్యవసాయశాఖ, వెలుగు, పశు వైద్యశాఖ, గ్రామ సచివాలయం కార్యదర్శుల సమన్వయం తో పాడి పశువుల పెంపకం లో అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. ఎక్కువ మంది ప్రజలు పాడి పశువుల పెంపకం పై ఆధారపడి జీవిస్తున్నందున, పశువుల కొనుగోలు వాటి పెంపకం ద్వారా లభించే ఆర్థిక భరోసాను వారికి తెలియజేసి పాడి పశువుల పెపకాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతులు వర్మీ కంపోస్టని వినియోగించి పంటలు పండించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. పశువులకు ఎటువంటి ఆహారం అందిస్తే ఎక్కువ పాలు ఇవ్వగలవు వాటి పట్ల పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే బాధ్యత అధికారులపై ఉంద న్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి మండలంలో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, గ్రామ సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలిపోతున్న వంతెనలు...

స్తంభిస్తున్న రవాణా వ్యవస్థ...

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పలు వంతెనలు కూలిపోవడం కొన్ని దెబ్బ తినడం వలన రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది. ముఖ్యంగా వాణిజ్య కేంద్రమైన అనకాపల్లి అటు నియోజకవర్గ కేంద్రమైన చోడవరానికి ప్రధాన రహదారిగా చెప్పుకుంటున్న బి.ఎన్ రోడ్లో విజయరామరాజు పేట వద్ద తాచేరు వంతెన కొట్టుకుపోవడం కారణంగా దాదాపుగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయిందని చెప్పాలి. అదేవిధంగా వడ్డాదిలో కాజ్వే నిర్మాణం దెబ్బతినడం, వి ఆర్ పేట కట్టు వారి అగ్రహారం మధ్య గల వంతెన కూలిపోవడంతో రవాణా వ్యవస్థకు తీవ్ర ఆటంకం కలుగుతుందని రవాణా వ్యవస్థ స్తంభించడం కారణంగా విద్యార్థులు, వాణిజ్య సముదాయాల వ్యాపారస్తులు, ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ప్రభుత్వం తాత్కాలిక ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

జన్నవరంలో పెచ్చుమీరుతున్న వైసిపి అరాచకాలు

బలవంతపు భూ తగాదాలు, దౌర్జన్యాలు

విశాలాంధ్ర-చోడవరం: గద్దె దిగిన వైసిపి నాయకులు మండలంలోని జన్నవరం గ్రామంలో అరాచకాలు, బలవంతపు భూ తగాదాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అధికారం మారినను, వైసీపీ అరాచకాలు ఆగలేదు .... భూతగాదాలు కారణంగా జన్నవరంలో శుక్రవారం రాత్రి ఒకరిపై ఒకరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాల్లోకి వెళితే మోటూరు చిన్న అప్పారావు అనే వ్యక్తి బొగ్గ గణేష్ కు భూమిని అమ్మగా, అదే భూమిని తనకు అమ్మడని వైసిపి కు చెందిన సాలాపు మారినాయుడు గణేష్ తో గొడవపడి తీవ్రంగా గాయపరిచాడు. దీనిపై గణేష్ కుటుంబీకులు మాట్లాడుతూ తమ భూమిని ఆన్లైన్ అవలేదని, ఎవరి పేరునైతే ఉందో వారిని దొంగతనంగా తీసుకెళ్లి వైసిపి వాళ్ళు రిజిస్ట్రేషన్ చేయించుకుని భూమి, నాదనే దౌర్జన్యంగా దున్నుతూ భూమిగల వ్యక్తులు వెళితే ఇది నేను కొనుకున్నాను నీకు ఏమి సంబంధం అని కర్రలతో దాడి చేశారన్నారు. సాలాపు మారినాయుడు, వాళ్ళ కుటుంబీకులు దారుణానికి పాల్పడి, ... మిమ్మల్ని చంపేస్తానని, మిమ్మల్ని బ్రతకనివ్వమని, గవర్నమెంట్ మీది అయినా ఏమి పీకలేరని, గ్రామంలో ఇటువంటి పలు అరాచకాలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు దీనిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు బాధితులని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదనపు విద్యుత్ స్తంభం ఏర్పాటు...

విశాలాంధ్ర వార్తకు స్పందించిన అధికారులు...

విశాలాంధ్ర -బుచ్చయ్యపేట: మండలంలోని సీతయ్యపేట గ్రామంలో విద్యుత్ తీగలు చేతికి తగిలే ఎత్తులో వేలాడుతున్నాయని ఈనెల 14వ తేదీన విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన వార్తకు శనివారం వడ్డాది సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అదనపు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయడంతో గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృధాగా పోతున్న తాగునీరు...

అధికారులు స్పందించాలని విజ్ఞప్తి...

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో పాత కుమ్మరి వీధిలో దొండ వారి పాత మేడ పక్కన ఉన్న కులాయి పైపులైను పగిలిపోవడంతో త్రాగునీరు వృధాగా పోతుంది. దీని కారణంగా కాలనీవాసులకు పూర్తిస్థాయిలో త్రాగునీరు సరిపడా అందడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జాతీయ రహదారి భద్రతపై డ్రోన్ సర్వే

పరిశీలించిన డి.ఎస్.పి, హైవే అధికారులు

విశాలాంధ్ర-యస్.రాయవరం : జాతీయ రహదారి భద్రతపై డ్రోన్ సర్వే నిర్వహించారు .జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం నక్కపల్లి రూరల్ సర్కిల్ పరిధిలో జాతీయ రహదారి లో ప్రమాద స్థలాలను డ్రోన్ ద్వారా గుర్తించడం జరిగింది .వాహనాలు ప్రయాణం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు హెచ్చరిక బోర్డులు వంటి వాటిపై హైవే అధికారులతో చర్చించారు నర్సీపట్నం డిఎస్పి పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రస్తుతం టెక్నాలజీ సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎల్ రామకృష్ణ నర్సీపట్నం రవాణా శాఖ అధికారి ఎస్ వి ఆర్ మూర్తి, హైవే సేఫ్టీ అథారిటీ అధికారి నవీన్, ఎస్ఐ ఏ.విభూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

వరదలు వస్తే ఏడు గిరిజన గ్రామాల వారికి తాడే ఆధారం

విశాలాంధ్ర-వి.మాడుగుల : వరద వస్తే ఆ ఏడు గిరిజన గ్రామాల వారికి తాడే ఆధారం. స్వాతంత్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటుతున్నప్పటికీ ఆ ప్రాంతాలలో గల గిరిజనులకు రహదారి కష్టాలు తప్పడం లేదు. మాడుగుల మండలం శంకరం పంచాయతీ మామిడిపాలెం, గొప్పూరు, రావిపాలెం, కొత్తవలస, రాజంపేట, వెలగలపాడు, తాడివలస గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆయా గిరిజన గ్రామాలలో సుమారు రెండు వేల మంది నివాసముంటున్నారు. ఆ గ్రామాలకు ముందుగా ఉరక గడ్డ జలాశయం ఉంది. అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న జలాశయం వరదలు ఉధృతంగా వచ్చే సమయంలో ఆ ఏడు గ్రామాలకు బాహ్య ప్రపంచాలతో సంబంధ బాంధవ్యాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఆయా గిరిజన గ్రామాల్లో ఎవరైనా రోగాల బారిన పడితే అయితే పసరు మందు వాడాలి, లేదంటే 30 కిలో మీటర్ల దూరంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ రకాలుగా ప్రయాణాలు చేసుకొని వైద్యం అందుకోవాలి. ప్రయాణంలో డోలి మోత తప్పనిసరి. లేదంటే ప్రాణాల మీద ఆశ వదులుకోవాల్సిందే. ఎన్నికల ముందు ఓట్లు అడగడానికివచ్చే ప్రతి నాయకుడు వంతెన నిర్మిస్తామని హామీ ఇవ్వడం.,. తాము వినడం. తమకు అలవాటుగా మారిందని ప్రభుత్వాలు ఎన్ని మారిన స్వాతంత్రం సిద్ధించి ఏడు శతాబ్దాలు దాటుతున్నప్పటికీ తమ పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ఆ గిరిజన గ్రామాల ప్రజలు ఆక్రోశిస్తున్నారు.

తాడు సాయంతో వెళుతున్న గిరిజనులు

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన హోం మంత్రి అనిత

అడ్డురోడ్డు జంక్షన్ వద్ద టీ తాగుతూ స్థానికులతో ముచ్చటించిన మంత్రి



విశాలాంధ్ర-నక్కపల్లి: మండలంలో శనివారం వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతీ కన్వెన్షన్‌లో జరిగిన స్త్రీ శక్తి కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. మంత్రి అనిత వేంపాడు టోల్ ప్లాజా నుండి అడ్డురోడ్డు వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, సామాన్య ప్రజలతో కలిసిపోయారు. అనంతరం అడ్డురోడ్డు జంక్షన్ వద్ద టీ తాగుతూ స్థానికులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, నేను మహిళా పక్షపాతిని. మహిళలు నా అభిమానులు కాదు %-% నా అక్కచెల్లెల్లమ్మలు అన్నారు. చాలా పార్టీలు వచ్చాయి, వెళ్లాయి. కానీ చరిత్రలో నిలిచిపోయే పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అని చెప్పారు. ఎన్టీ రామారావు గారు ఒక వ్యక్తి కాదు- ఒక శక్తి అని, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు అన్నారు. మహిళలు రాజకీయాల్లో రాణించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి ముఖ్యమైన దన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే సమాజ వ్యవస్థ బాగుంటుంది. వారు సంపాదిస్తే కుటుంబ అభివృద్ధి వేగవంతమవు తుందన్నారు. ఉచిత బస్సుపథకం మహిళలకు ఎంతో ఉపయోగ పడుతోందని చెప్పారు. అన్నా క్యాంటీన్లు ఐదు రూపాయలకే భోజనం అందించేవి అని, కానీ గత ప్రభుత్వ హయాంలో వాటిని తొలగించడం దురదృష్టకరమన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, వారికి సబ్సిడీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఆస్తులను తాకట్టు పెట్టి ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, అయినప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తోందని చెప్పారు. ఈగల్ వ్యవస్థ ద్వారా గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విశాఖ నగరం దేశంలోనే మహిళా రక్షణలో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. బొమ్మల పరిశ్రమ రాకకు ప్రయత్నిస్తున్నామని, ఇది స్థాపితమైతే 25 వేల మహిళలకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని మంత్రి అనిత తెలిపారు.



లక్ష్మి గణపతి దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం..

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్రంలోని విఘ్నేశ్వరుని దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం పిఎస్ పేట బ్రాహ్మణ వీధి లో 134 ఏళ్లకు పైగా కొలువుతీరిన శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో గణపతి నవరాత్రుల సందర్భంగా నాలుగవ రోజైన శనివారం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పుత్రేవు శ్యాం ప్రసాద్ తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాల్లో పుణ్య దంపతులచే వేద ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుని కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ఆరవెల్లి శేష సూర్య గోపాలచార్యులు, గోవిందా చార్యులు, నరసింహాచార్యులు తెలియజేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నియమిత భక్తులు, గణేష్ మాలాధారణ స్వాములచే సామూహిక శ్రీ లక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు. సర్వ శ్రేయోభివృద్ధికి వేకువ జామునే భక్తులు, గణేష్ దీక్షాపరులుచే శ్రీ లక్ష్మీ గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అధర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, ఉపనిషత్తు పారాయణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు, ఉత్సవ కమిటీ తెలియజేశారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చు స్వామిగా, కార్యసిద్ధి గణపతిగా చరిత్ర ప్రసిద్ధి చెంది, భక్త సులబుడగు శ్రీ లక్ష్మీ గణపతిని నవరాత్రి ఉత్సవాలు లో పలువురు ప్రముఖులు, అధికారులు దర్శించుకోవడం ఓ విశేషం. చోడవరం చుట్టుపక్కల గ్రామాల నుండే కాక విశాఖపట్నం, హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రధాన నగరాల నుండి కూడా భక్తులు పీఎస్ పేట శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానానికి ఈ నవరాత్రులలో తరలివస్తూ.... స్వామిని తప్పనిసరిగా దర్శించు కోవడం, ఆలయంలో జరిగే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం వారి నమ్మకం, ఓ విశేషం. గణపతి నవరాత్రులలో ప్రతిరోజు దీక్షాపరులైన భక్తులకు నిత్య అన్నదానం నిర్వహిస్తూ ఉండడం ఇక్కడ మరో ప్రధాన విశేషం. ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు, పుణ్య దంపతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థిని పాయకరావుపేట గోడత తబిత నిహాల్

విశాలాంధ్ర-పాయకరావుపేట : పాయకరావుపేట పట్టణానికి చెందిన గోడత తబిత నిహాల్ ఈ ఏడాది మే నెలలో జరిగిన నీట్ పరీక్షల్లో ర్యాంకు సాధించి శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. పట్టణంలోని ఆదర్శనగర్ కు చెందిన గోడత తబిత నిహాల్ 10వ తరగతి పట్టణంలోని కనొస్సా ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదివి 600 మార్కులకు 600 మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. తునిలో శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి 1000 మార్కులకు 978 మార్కులు సాధించింది. డాక్టర్ అవ్వాలనే పట్టుదలతో కోచింగ్ తీసుకుని నీట్ లో 4623 ర్యాంకు సాధించింది. తబిత ఎంబిబిఎస్ సీటు సాధించటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వినాయక అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న గండి రవికుమార్

విశాలాంధ్ర-సబ్బవరం: మండలం లోని మొగలిపురం గ్రామంలో సూర్యనారాయణస్వామివారి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర శనివారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండి రవికుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నసమారాధనలో భారీగా భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదమును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గురి బంగారయ్య , వైస్సార్సీపీ నాయకులు యడ్ల నాయుడు , సింగంపల్లి విశ్వనాధం , గండి ముత్యాలనాయుడు , బత్తిన వెంకట్ , గండి రవికుమార్ యువసైన్యం పాల్గొన్నారు.

సబ్ జైల్ ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ పి విజయ

విశాలాంధ్ర-యలమంచిలి: పట్నంలోని సీనియర్ సివిల్ జడ్జ్ పి విజయ, ప్యానల్ లాయర్స్ పానల్ లాయర్స్ బి హరి శంకర్ రావు, పి వి రమణ, జైలు సూపరెంట్ ప్రసాద్ రావు, జైల్లో ఉన్న ముద్దాయిలను వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు. వారికి కావలసిన ఉచిత న్యాయ సహాయం గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్ ప్రయోగాన్ని పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలోని దార్లపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రోన్ ద్వారా ఎరువులు పురుగుమందులు పిచికారి ప్రయోగ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. మోహన్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ఎరువులు వినియోగం చేయాలంటే డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు తక్కువ ఖర్చుతో ఈ డ్రోన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సౌజన్య, నక్కపల్లి వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, గ్రామ సర్పంచ్ సుభాషిని ,ఉప సర్పంచ్ మూర్తి, గ్రామ పెద్దలు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, బేతా బత్తుల రాము, రంగనాథ్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జోగినాయుడు మాస్టార్ గ్రంథాలయ 14వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో పెతకంశెట్టి జోగి నాయుడు మాస్టార్ గ్రంథాలయ 14వ వార్షికోత్సవం, స్వర్గీయ పెతకంశెట్టి బాబురావు 86వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజులు పాటు జరిగిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిమ్స్ ఐకాన్ ఎండీ,పముఖ వైద్యుడు పెతకంశెట్టి సతీష్ కుమార్ హాజరై మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలుతో సమానమని,వాటి సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఏటా వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను,పెద్దలను అభినందించారు. రాజకీయాలకు అతీతంగా వివాదరహిత అభివృద్ధికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. 2024-2025 సంవత్సర పదో తరగతి,ఇంటర్,డిగ్రీ,పాలిసెట్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు,మళ్ల వరహా నర్సింగరావు,బొడ్డేడ సత్యనారాయణ, వెలగా నర్సింగ రావు,కొయిలాడ దశావతారం,మళ్ల రాజేష్,మళ్ల శేషు,మళ్ల కన్నుంనాయుడు,పీలా జగదీష్,మళ్ల జోగినాయుడు,మొల్లేటి రవి,ఆదారి బాలాజి, నాయుడు,గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రి ప్రారంభానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-వి.మాడుగుల : సెప్టెంబర్ 1వ తేదీన మాడుగుల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కే.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఇంకా పలువురు జిల్లా అధికారులు, మండల అధికారులు, నాయకులు విచ్చేస్తున్నారని తెలిపారు. మండలంలో గల ఇతర అధికారులు నాయకులు, స్థల దాతల కుటుంబీకులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్న ఆటోలు

విశాలాంధ్ర-వి.మాడుగుల: ఉచిత బస్సు ప్రయాణం పథకంతో మాడుగుల పట్టణంలో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. మాడుగుల పట్టణంలో సుమారు 120 పైగా కుటుంబాలు ఆటోలపై వచ్చే ఆదాయంపై ఆధారపడి ఉన్నాయి. ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు అంటూ శ్రీశక్తి పథకం పేరుపై మహిళలకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయడంపై ఈ ఆటోలనే నమ్ముకుని కాలం వెళ్లదీస్తున్న పలు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రధాన మార్గంలో వర్షాల కారణంగా వంతెన కూలిపోవడంతో బస్సుల రాకపోకలు లేకపోవడం వలన తమకు కొంతైనా బేరం వస్తుందని, వంతెన నిర్మాణం పూర్తి అయితే మరింత దిగజారే పరిస్థితి వస్తుంది అని పలువురు ఆటో డ్రైవర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌రాయవరం నూకాంభిక అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర-యస్ .రాయవరం : మండల కేంద్రం ఎస్. రాయవరం గ్రామంలోని నూకంబిక ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. సీతారామ యూత్(కమిటీ కుర్రోళ్ళు) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద అన్న సమారాధన నిర్వహించడంతో గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు .ఈ కార్యక్రమంలో సీతారామ యూత్ కమిటీ కుర్రోళ్ళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం: విద్యార్థులకు చేయూత అందించా లనే స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ చేసినట్లు సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి శివ బాబునాయుడు అన్నారు . శనివారం మండలంలోని తిమ్మరాజుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ స్టీల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాలుష్య కారకమైన ప్లాస్టిక్ బాటిల్ కంటే పర్యావరణ సహిత స్టీల్ వాటర్ బాటిల్ ఆరోగ్యకరం అన్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు మారిశెట్టి వెంకట అప్పారావు , అంగన్వాడీ కార్యకర్త భారతి , ఆయా రూప , ఆలేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఆచార్యులు మాష్టారుకి శిక్షా రత్న పురస్కారం

విశాలాంధ్ర-నక్కపల్లి: మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్ లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచే యుచున్న ఎన్.వి.ఎస్.ఆచార్యులకు శనివారం మానవహక్కులు మరియు నేరనిరోధక విభాగం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆచార్యులను శిక్షారత్న అవార్డుతో ఘనంగా సత్కరించారు. శనివారం విశాఖపట్నం అంబేద్కర్ భవన్ లో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి మానవహక్కుల &నేర నిరోధక సంఘం నేషనల్ చైర్మన్ బోడ రాకేష్ చేతులమీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. సమాజంలో వివిధ రంగాలలో సేవాకార్యక్రమాలను చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఈ అవార్డులను అందజేస్తున్నట్లు.మానవహక్కుల సంఘం, నేరనిరోధక విభాగం నేషనల్ చైర్మన్ బోడ రాకేష్ అన్నారు.79 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజంలో నిస్వార్ధంగా సేవలందించినవారిని ,మెరుగైన బోధన అందిస్తున్న వారిని గుర్తించి ఈ పురస్కారాలను అందజేశామన్నారు.ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ ఈ పురస్కారంతో నాపై మరింత బాధ్యత పెరిగిందని, కరోనా సమయంలో ఉచితంగా గ్రామాలలో మాస్కులు పంపిణీ, ఉచితంగా ఆహారపొట్లాలు అందించడం, గ్రామాలకు వెళ్ళి విద్యార్థులకు కథలు చదివించి పోటీలు నిర్వహించడం, పరీక్షల సమయంలో రాత్రివేళ విద్యార్థుల ఇండ్లకు వెళ్ళి దగ్గర ఉండి చదివించడం,గ్రంథాలయాలలో జరిగే వివిధ కార్యక్రమాలు లో రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించడం,పలుమార్లు పద్యపఠనం పోటీలను నిర్వహించి స్వంత ఖర్చులతో బహుమతులు అందించడం, విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించే అనేక కార్యక్రమాలను చేపట్టడంతో ఈ శిక్షారత్న పురస్కారంతో సత్కరించడం జరిగిందన్నారు.ఆచార్యులు మాష్టారుకి అందిన ఈ పురస్కారంతో గ్రామంలో అన్ని పార్టీల నాయకులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.